క్లుప్తంగా

ఎన్జీఓల సేవలు అభినందనీయం

తాళ్లరేవు: సమాజానికి ఎన్జీఓలు అందిస్తున్న సేవలు అభినందనీయమని తాళ్లరేవు రిలయన్స్ ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ ఇంచార్జ్ మోనబత్తుల గోపాలరావు అన్నారు. గురువారం కోరంగి పంచాయతీ సీతారామపురంలోని సెంటర్‌లో ప్రపంచ ఎన్జీఓల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ శ్రీకాంత్ ఎన్జీఓల సేవలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ సత్తిబాబు, స్పెషల్ ఎడ్యుకేటర్ స్టీఫెన్, ఉదయకుమారి, నాగమణి, రేణుక, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ఆర్థిక చేయూత


మహిళలకు చెక్కు అందజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్‌యూఎల్‌ఎం) ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కోసం ఇచ్చే ఆర్థిక సాయాన్ని గురువారం ఆర్‌ఏఓ మునిస్వామి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించడం ద్వారా వారి కుటుంబాల అభివృద్ధికి సహాయ పడవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథ్ మృతి క్రీడారంగానికి తీరని లోటు


విశ్వనాథ్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు

ఉప్పలగుప్తం: ఖేల్‌రత్న అవార్డు గ్రహీత, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ మృతి పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు సంతాపం తెలిపారు. గొల్లవిల్లిలోని రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి ఏఎస్‌ఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. గొల్లవిల్లి కేంద్రంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడంలో ఆయన కృషి దాగి ఉందని పలువురు క్రీడాకారులు కన్నీటి పర్యంతమయ్యారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యురాలికి పితృవియోగం


గోవిందరాజులు

ఉప్పలగుప్తం: అయినవిల్లి మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ తండ్రి గనిశెట్టి గోవిందరాజులు (83) అనారోగ్యంతో స్వగ్రామమైన సన్నవిల్లి గ్రామంలో గురువారం మృతి చెందారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అకౌంట్స్ జనరల్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేశారు. దీర్ఘ కాలంగా హోమియో వైద్యునిగా, వాస్తు, విద్య, వివాహ సంబంధ విషయాలలో కోనసీమ వ్యాప్తంగా ఎందరో ప్రజలకు ఉచిత సేవలు అందించారు. భౌతిక కాయాన్ని సన్నవిల్లిలో పలువురు సందర్శించి నివాళులర్పించారు.

బౌద్ధ సమ్మేళనం కరపత్రాల విడుదల

అమలాపురం టౌన్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఏపీ శాఖ ఆధ్వర్యంలో మార్చి 9న అనకాపల్లిలో జరగనున్న బౌద్ధ సమ్మేళనానికి జిల్లాలోని బౌద్ధులు హాజరై విజయవంతం చేయాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబోది కాశి, ములపర్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో బౌద్ధ సమ్మేళనం కరపత్రాల విడుదల కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. కరపత్రాలతో బీఎస్ఐ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ప్రదర్శన నిర్వహించారు. బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీ లోక్, సామాజిక వేత్త డాక్టర్ భీమారావు, బీఎస్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ, వీకేసీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, జంగా రాజేంద్రప్రసాద్, గోసంగి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.


బౌద్ధ సమ్మేళనం కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా బీఎస్ఐ ప్రతినిధులు


ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


అమలాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నిషాంతి


ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణావు


ఓటు వేస్తున్న ఎంపీ హరీష్ మాధుర్


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన కొత్త ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల పరిధిలోనే కూటమి నేతల ప్రచారం
- అమలాపురంలో కూటమి, పీడీఎఫ్ ఓటర్ల మధ్య వాగ్వాదం
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజా ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అమలాపురం పట్టణం, రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన 6 పోలింగ్ కేంద్రాల్లోని 10 బూత్‌ల్లో ఎన్నికలు గురువారం ఉదయం ప్రశాంతంగా జరిగాయి. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీరాజ్, ఎంపీడీవో కార్యాలయం, ఎస్‌కేబీఆర్ కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటింగ్ ఉదయం కొంచెం మందకొడిగా సాగినా 10 గంటల నుంచి 1 గంట వరకూ ఆశాజనకంగా జరిగి 50 శాతం దాటి పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకూ పోలింగ్ కొంచెం నెమ్మదిగా సాగినా సాయంత్రం 4 గంటలకు కొంచెం వేగం పెరిగి 65 శాతం దాటింది. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌కేబీఆర్ కళాశాల పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు.

పీడీఎఫ్ ఏజెంటు నిర్వాకంపై అభ్యంతరం

ఎస్‌కేబీఆర్ కళాశాల పోలింగ్ కేంద్రంలోని ఓ బూత్‌లో పీడీఎఫ్ అభ్యర్థి తరపున ఏజెంట్‌గా ఉన్న ఓ వ్యక్తి యూటీఎఫ్ డైరీని చూపిస్తూ ఓటర్లను మభ్య పెట్టడంపై కూటమి నేతలు అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో రెండు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం అనివార్యమైంది. చివరకు పోలింగ్ అధికారులు, పోలీసులు పీడీఎఫ్ ఏజెంట్‌ను బయటకు పంపించేయడంతో గొడవ చల్లారింది. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తహసీల్దార్ కార్యాలయ పోలింగ్ కేంద్రాన్ని, డీఆర్వో, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి రాజకుమారి ఎస్‌కేబీఆర్ కళాశాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిపై ఆరా తీశారు.

కూటమి నేతల ప్రచారం

అమలాపురంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో కూటమి నాయకులు పోలింగ్ కేంద్రాల పరిధుల్లోనే తిష్టవేసి ఓటర్లను మభ్యపెట్టేలా ప్రచారం చేయడాన్ని పీడీఎఫ్, ఇండిపెండెంట్ అభ్యర్థుల నాయకులు అభ్యంతరం తెలిపారు. ఎస్‌కేబీఆర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద కూటమి నాయకులు టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేయాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సైతం కూటమి నాయకులు పోలింగ్ కేంద్రంలో తిష్ట వేసి ఓట్లు వేయాలని ఓటర్లకు సైగలు చేశారు. ఇలా ప్రతి పోలింగ్ కేంద్రంలో కూటమి నేతలు ఎన్నికల నియామళిని తుంగలో తొక్కి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అమలాపురంలో పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఐ.వెంకటేశ్వరావు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్‌లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అల్లవరం: అల్లవరం ఉన్నత పాఠశాల, అభ్యుదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 2,161 ఓట్లకు గానూ 75.4 శాతంతో 1,631 ఓట్లు పోలయ్యాయి. అల్లవరంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ మాధవి, డీఎస్పీ టీఎస్‌కే ప్రసాదు పరిశీలించారు. కొత్తగా ఓటు వచ్చిన పట్టభద్రులు ఓటు వేయడానికి ఆశక్తి చూపారు. గర్భిణులు, చంటి పిల్లలను సైతం పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేశారు. వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా సీనియర్ సిటిజన్లు ఓటు వేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను అమలాపురంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.


అల్లవరంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ముమ్మిడివరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముమ్మిడివరం మండలంలో 71 శాతం ఓట్లు పోలయ్యాయి. ముమ్మిడివరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మూడు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లలో జరిగిన ఎన్నికలలో మొత్తం 3,107 ఓట్లకు గానూ 2,256 ఓట్లు పోలయ్యాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొన సాగింది. ఎస్సై జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలలో 1953 మంది ఓటర్లకు గానూ 1475 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కూటమి నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద ఒకింత హడావిడి చేసినా పట్టభద్రులు వారి ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా సాగింది. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఐ.పోలవరంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్ సహితం ఇదే బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తాళ్లరేవు: మండల పరిధిలోని మూడు పోలింగ్ కేంద్రాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో 885 ఓట్లకు గానూ 641 మంది, సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో 917 ఓట్లకు గానూ 692, పటవల పంచాయతీ కార్యాలయంలో 712 ఓట్లకు గానూ 526 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 2,514 ఓట్లకు గానూ 1,859 మంది ఓటేసారు. 1165 మంది పురుషులు, 694 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 73.95 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. ఎస్సై సత్యనారాయణ బృందం బందోబస్తు నిర్వహించారు.

అమలాపురం రూరల్: ఉమ్మడి గోదావరి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల పోలింగ్ అమలాపురంలో ప్రశాంతంగా జరిగింది. అమలాపురం మండలంలో ఐదు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించారు.

ఎస్‌కేబీఆర్ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఎంపీడీవో కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అమలాపురం నియోజవర్గంలో గురువారం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయనికి 73 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం 16 కేంద్రాలల్లో 11,334 మంది ఓటర్లు ఉండగా 8,443 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

కాట్రేనికోన: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 246, 247,248 బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 1884 ఓట్లకు గానూ 1375 ఓట్లు పోలయ్యాయి. పోలీంగ్ కేంద్రాల వద్ద ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు.


అల్లవరంలో ఓటు వేసిన మహిళా ఓటర్లు


ముమ్మిడివరంలోలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న పట్టభద్రులు


ఉప్పలగుప్తంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన పట్టభద్రులు


కాట్రేనికోనలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

వైభవంగా బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవం


బాలయోగీశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం: భగవాన్ బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవాలు గురువారం వైభవోపేతంగా జరిగాయి. సుమారు 40 ఏళ్ల పాటు కఠోర తపస్సు చేసి ఈ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా గుర్తింపు తీసుకువచ్చిన బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడుకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, కాశిబాల మునికుమారి, మున్సిపల్ కమిషనర్ రవివర్మ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, ములపర్తి బాలకృష్ణ, పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొని బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకున్నారు. సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై జ్వాలా సాగర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తపో ఆశ్రమంలో డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని కాకినాడ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక ఆదేశించారు. గురువారం సుంకరపాలెం ఎక్సైజ్ చెక్ పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా నమోదైన కేసులకు సంబంధించి రిజిస్టర్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉండరాదని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.


ఎక్సైజ్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రేణుక

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పి.మల్లవరం, జార్జీపేట, పోలేకుర్రు, నీలపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాలకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

హార్టికల్చర్ ఫెయిర్‌కు రైతుల పయనం

యానాం: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు జరిగే జాతీయ ఉద్యానవన ప్రదర్శనలో పాల్గొనేందుకు గురువారం యానాం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్‌ఏఓ మునిస్వామి రైతులు వెళ్లే బస్సుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ ఉద్యానవన ప్రదర్శనకు 26 మంది రైతులు, 6 గురు అధికారులు వెళుతున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనల ద్వారా రైతాంగం ఆధునిక మొక్కల పెంపకం, సమగ్ర సస్యరక్షణా విధానాలపై అవగాహన పొందుతారన్నారు.


బెంగళూరు వెళ్లే రైతుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిస్వామి

వైభవంగా గాయత్రీ హోమం

అమలాపురం టౌన్: గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక దక్షిణేశ్వర శక్తిస్థల్‌లో మాఘ అమావాస్య పురస్కరించుకుని మహాలక్ష్మి సహిత గాయత్రీ హోమం గురువారం వైభవంగా జరిగింది. తొలుత గాయత్రీ మాతకు అక్షయ పాత్ర ప్రతినిధులు పూజలు గావించి అనంతరం హోమం నిర్వహించారు. అక్షయపాత్ర ప్రతినిధులు లింగోలు విస్సు, శిరీష దంపతులు కర్తలుగా హోమం జరిగింది. అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో ఆ సంస్థ ప్రతినిధులు, సేవకులు భక్తులకు సేవలు అందించారు.

జిల్లా ప్రజా రవాణా అధికారికి సత్కారం

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా నుంచి కుంభమేళాకు అత్యధికంగా బస్సులు పంపిన ఆర్టీసీ కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్.శ్రీనివాసరావును ఉద్యోగులు సత్కరించారు. మహాకుంభ మేళా యాత్రకు కోనసీమ జిల్లా నుంచి అత్యధికంగా 26 బస్సులను నడపటం జరిగిందని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ బస్సులను నడపటానికి కీలక పాత్ర పోషించి సహాయ సహకారాలు అందించిన డీపీటీఓ శ్రీనివాసరావును డీఎం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం ఘనంగా సత్కరించారు. గ్యారేజ్ ఇంచార్జ్ జీఆర్‌ఎల్ దేవి, ట్రాఫిక్ ఇంచార్జ్ ప్రతిమా కుమారి, ఓపీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వరాల బాబు, బుకింగ్ సూపర్‌వైజర్ నాగరాజు, కౌంటర్ ఉద్యోగులను బహుమతులతో డీఎం సత్కరించారు.


డీపీటీఓను సత్కరిస్తున్న డీఎం మూర్తి, ఉద్యోగులు

ఘనంగా అఘోర పశుపతి హోమం

యానాం: నియోజకవర్గ పరిధిలోని అయ్యన్ననగర్‌లో స్వధర్మ ప్రచార కేంద్రం వేద పాఠశాలలో అఘోర పశుపతి హోమం గురువారం ఘనంగా నిర్వహించారు. 11వ ఏడాది మహా శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. అంతకు ముందు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మల్లాడి వసంతరావు, బాబూజీ, అద్దంకి శ్రీనివాసరావు, పాలెపు ధర్మహరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


వేద పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లాడి

స్థల విక్రయంపై ఎల్జీకి ఫిర్యాదు

యానాం: వెంకన్న ఆలయ ప్రాంగణ పరిధిలో మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని విక్రయించడంపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కై లాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు తెలిపారు. యానాం మున్సిపాలిటీకి చెందిన ఆ స్థలాన్ని మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుకు అమ్మడం సరికాదని ఆలయ ఆధీనంలో ఐదు వందల ఏళ్లకు పైగా ఆ స్థలం ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అమ్మాలంటే వేలం నిర్వహించాల్సి ఉందన్నారు. తక్షణం అమ్మకాన్ని రద్దుచేసి నామమాత్రపు ధరతో ఆలయానికి ఆ స్థలాన్ని అప్పగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి బొంతు శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. 1992–93 ఏడాది పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బొంతు శ్రీనివాస్ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో బెంచీల తయారీకి గానూ విరాళాన్ని హెచ్‌ఎం జొన్నాడ ఆశాలతకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నడింపల్లి వినోద్, పోతులరాజు, విత్తనాల కరిమలస్వామి, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం ఆశాలతకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్ →



మెజీషియన్ అలీకి అవార్డు

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన మెజీషియన్ అలీ ప్రతిష్టాత్మకమైన సీనియర్ పీసీ సర్కారు మెమోరియల్ అవార్డును గురువారం అందుకున్నారు. ఇంటర్నేషనల్ మెజీషియన్స్ డేను పురస్కరించుకుని ఆర్‌కేస్ వండర్ వరల్డ్, తెలంగాణ మ్యాజిక్ అకాడమీ సంయుక్తంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్, కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సమావేశంలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరిపల్లి నంద, తెలంగాణ ప్రభుత్వ లాంగ్వేజ్ మరియు కల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అలీ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అలీని పలువురు అభినందించారు.

హైకోర్టు జడ్జి నంద నుంచి అవార్డు అందుకుంటున్న మెజీషియన్ అలీ →

